# పైరుపాట

బోయి భీమన్న

# ప్రస్తావన

ఇది "పైరు పాట". పైరు చేలు, పచ్చికబీళ్లూ, అచ్చటి గడ్డి పిల్లలూ, కుర్రవాళ్ల షికార్లూ, ఈ పాటకు ఆలంబన. సంగీతరూపకంగా ప్రదర్శించవచ్చు దీన్ని. నృత్యాన్ని జోడించనూ వచ్చు. ఒకప్పుడు ఆకాశవాణిలో ఇది ప్రసారిత మయింది కూడ.

దీన్ని వ్రాసి కూడ పాతికేళ్ళయిందంటే కొందరు విమర్శకులు "టూ లేట్" అని పెదవి విరవవచ్చు. నా దృష్టిలో సాహిత్యానికి లేటు అనేది లేదు. ఉన్నదనుకొన్నా, చేసేది కూడ ఏమి లేదు. ఎందుకంటే ఇలాంటివే (నేను పాతికేళ్ళ క్రితం వ్రాసినవే) రకరకాల కావ్యాలు ఇంకా ఒక డజను వరకూ నా దగ్గర అముద్రితాలుగా పడి వున్నాయి కాబట్టి.

బహుశా పన్నెండేళ్ళ క్రితం, ఇది "స్నేహ సుందరి" అనే పేరుతో ఒక వారపత్రికలో సీరియలుగా ప్రకటించబడి, కొన్ని రీప్రింట్లు కూడ తీయబడింది. ఇప్పుడు దీన్ని పెంచి, పరిష్కరించి ప్రకటిస్తున్నాను.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి మాన్యశ్రీ సంజీవయ్య గారికి ఈ "పైరుపాట"ను కృతి ఇస్తున్నాను. వారు సహృదయులు. సంగీత సాహిత్యాలలో మంచి ప్రవేశమున్నవారు. ఎనిమిదేళ్ళ క్రితం "మధుబాల"ను కృతి ఇచ్చానువారికి. ఇప్పుడీ పేద పిల్లను స్వీకరిస్తున్నందుకు వారికి నేనెంతో కృతజ్ఞుణ్ని.

సంస్కృతీ సంవర్ధక సమితిని చాలకాలం తమతోపాటు గజ్జగట్టి ఆడించిన శ్రీ నంబూరి శ్రీనివాసరావుగారు, మూడేండ్లుగా దానికొక స్థిర రూపం కల్పించి నడుపుతున్నారు. ఈ సమితి తరపున "రాగవాసిష్ఠం" వలెనే దీనిని కూడ వారు ప్రకటించి పెట్టడం చాల సంతోషం.

తెలుగుకు పరభాషా సాహిత్యం తప్ప, సొంత సాహిత్యం ఎంతో లేదు. అందువల్లనే సొంతంగా ఆలోచించే విమర్శకులు కూడ బహుతక్కువ. లేరన్నా అతిశయోక్తికాదు. రాతియుగం నాటి విమర్శనా ప్రమాణాలతోనే అణుయుగం నాటి నవసాహిత్యాన్ని కూడ

కొలవడం మన దేశానికే చెల్లింది. కాలంతోపాటు సమాజమూ, సమాజంతోపాటు సాహిత్యరీతీ, దానితోపాటు విమర్శనా పద్ధతీ పురోగమించాలి. అందుకు దేశం నోచుకోలేదు.

ఏది ఏమైనా, ఇది నా స్వీయ సృష్టిలో మరొకమూర్తి. సహృదయుల చేతుల్లో పెడుతున్నాను. ముళ్లు గుచ్చుకొన్నా తీగలొత్తిగించి చూడగలవారికి ఆకులమాటున అరుణకాంతులు వెదజల్లే పుష్పాలు లభించకపోవు.

దీన్ని నృత్య సంగీత రూపకంగా ప్రదర్శించవచ్చు. రంగాలు కాలగమనాన్ని సూచించేవి మాత్రమే. మొదటి ఆరు రంగాలకూ దృశ్యం ఒకటే. ఏడవ రంగంలో మార్పు కుటీరం మాత్రమే. ఇది చిన్న రంగం. ఒక్క చిన్న అమ్మాయితో ఏ పెండ్లి సందర్భంలోనైనా ఈ రంగం ప్రదర్శించవచ్చు. పాడగల ఒక అమ్మాయి శీలగా నటిస్తే చాలు. వధూవరులే తక్కిన రెండు పాత్రలు కాగలరు.

–భీమన్న

# అంకితము

## ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి
## మాన్యశ్రీ సంజీవయ్యగారికి

శ్రీ దామోదర వంశ వర్ధనుడు
సంజీవయ్య సంజీవనీ
స్వాదుత్వమ్మున ముఖ్యమంత్రియయి ని
ల్వన్ నిల్చె దేశమ్ము ల
క్ష్మీ దృజ్మోద, ముమామనోహరము, బ్రా
హ్మీ రంజకమ్మౌచు; వే
దా దర్శమ్ముల పంట పండినవి నే
డాంధ్రాళి చిత్ క్షేత్రముల్!

వేదవిభజన చేసి, వేదాంతమును చెప్పి,
భరతవంశము నిల్పి, భగవానుడైన వే
దవ్యాస ఋషి గొల్చి–తత్పరంపరలోని
సంపూర్ణ మూర్తియౌ సంజీవయ నుతింతు.

కచుడు మరచిన జీవకరణి సంజీవ నీ
మంత్రమ్ము, ఉద్ధరింపగ దీనమానవుల,
తుంగభద్రా ప్రతీరాంగణములోన సం
జీవయాఖ్య జనించి జీవామృతము పంచె!

మున్నయార్యుని ఎన్ని యెన్ని కోర్కెల ఫలమొ
సుంకలాంబా గర్భశుక్తి ముక్తాఫలము!

కాంతికై ఎంత చీకటి యెట్లు వేగెనో
పట్టపగలైన దొక ప్రాభాత సమయమే!
పుణ్యానారాయణీ బుచ్చయార్యుల పుత్రి
కృష్ణవేణీ సాధ్వి కేలువట్టిన నాడె
ఆంధ్ర–తెలంగాణ మాంధ్రప్రదేశ మయె!
ఆంధ్రప్రదేశ మిపు డవనికే వెలుగయ్యె!
పాలకడలి నడిబొడ్డున
పద్మము వికసించె,
అవ్యవస్థ కడుపు నుండి
హరి–జనుడై జనించె!
సాగులేని నేల విరిసి
శాలి యెన్ను వేసె,
అలమటించు ఆశాతతి
కదే విందుచేసె!
రాయలతో ఏగిన సా
రస్వత రవిచంద్రిక
ఉదయించెను ప్రతియాంధ్రుని
హృదయాబ్జము మురియగ!
అవైదికము, అభారతీ
యము నౌ వర్గ భేదము
సమసి, నేడు వెలసె సర్వ
జన శ్రేయోరాజ్యము.
బాపూజీ కలలు నేడు
రూపముగొని నిలిచె,
శక్తిని గుర్తింప త్యాగ
శక్తుల నిటు మలిచె.
భారత మేకైక జాతి

ప్రబలమైన హేతి,
ప్రపంచమున మెరిసె నేడు
పాశుపతము రీతి.
అడుగు నుండి మెట్టు మెట్టు
అధిరోహించిన రవికి
ఆకాశములో తారల
ఆక్షేపణ దేనికి?
వదనముపై చిరునవ్వు,
ఎదలో కరుణారసము,
కరమున చక్రము, దామో
దర వరాంశ నీది!
చాతుర్యమే సర్వజనశక్తి నేడు,
విజ్ఞానమే విశ్వవిజయమ్ము నేడు,
సర్వశక్తులు సరస్వతి చేత కలవు,
సారస్వతుడ వీవు, సంజీవి విలకు.
"మధుబాల" నొసగి సమ్మానించితిని నాడు,
మంత్రి వప్పుడు; ముఖ్యమంత్రి విప్పుడు; "పైరు
పాట" నిత్తును నేడు పట్టంపురాణిగా,
ముద్దుగా స్వీకరింపుమయ! సంజీవయా!
ఇది నృత్యగాన సాహితి,
బ్రదుకున సుఖమిచ్చు పదసరస్వతి, ప్రేమా
స్పద; దీని నేలుకొను, మ
భ్యుదయ మ్మగు మీకు మాకు, ముఖ్యామాత్యా!

—భీమన్న

## (నృత్య సంగీత గేయ రూపకం)

### పాత్రలు

శ్రీవత్స : విద్యాధికుడు, భాగ్యవంతుడు అయిన గ్రామీణ యువకుడు, అభ్యుదయభావాలు కలవాడు.

స్నేహ : అమాయకురాలైన గ్రామీణ బాలికలు, గడ్డికోత జీవికగా కలవారు.

## మొదటి రంగం

(శ్రీవత్స రోజూ సాయంవేళ పైరుపొలాల్లోకి షికారుపోతూ వుంటాడు. అది పుష్యమాసం. పొలాలన్నీ బంగారు కొండల్లాంటి వరికుప్పలతోనూ, కొండల చుట్టూ దట్టంగా పెరిగిన కీకారణ్యాల్లాంటి రకరకాల పైరులతోనూ, చూడముచ్చటగా వున్నాయి. ఆ చేల గట్టులలో పచ్చగడ్డికోసం వచ్చే ఒక గడ్డిపిల్ల అతనికి పరిచయం అవుతుంది.)

శ్రీవత్స :

పచ్చ పచ్చని పైరు చేలో
విచ్చి విచ్చని వింత పువ్వా
నీకు నాకూ ఇంత దవ్వా :
రేక విప్పగదే :

లేత పచ్చిక పెరికి పెరికీ
లేపుకొంటివా చేత బొబ్బలు :
గీచుకొన్నవా కంది రొబ్బలు :
లేచిరావే, ప్రొద్దుపోయెను :

పెసరచేలో నుండి వూరెడు
పిట్ట తుర్రున పారిపోయెను
సందె గాలులు సాగి గుండెలు
జలదరించె గదే :

(ప్రక్క కందిచెట్ల మాటున గడ్డి కోసుకుంటూ వున్న ఆమె శ్రీవత్స పిలుపువిని, నవ్వుతూ ప్రవేశిస్తుంది. ఆమె ఒక చేత గడ్డిబుట్ట, ఒకచేత చిన్న కొడవలి వుంటాయి.)

గడ్డిపిల్ల :

తుర్రు మన్నంతనే పిట్ట,
తుళ్ళి పడ్డది - గుండె - పాపం ?
ఐన, నీ మీదేల కోపం ?
ఆగడమె కాదా ?

సందెగాలికి జలదరించే
దెందమున్నది చాలు నీకు,
గాలివానకు కూడ కదలని
గట్టు కద నా మనుగడ :

చినుకు చినుకున చివురు లెత్తీ
కనుపు కనుపున కోత పొందే
గరికపోచలు జట్టు నాకు,
కష్టమనిపిస్తుంది నీకు :

శ్రీవత్స :

నీవు మసలే పొలము కన్నా
నీవు తురిమే పూల కన్నా

నీవు కూర్చే గరిక కన్నా
నాకు లేదాక వేరె లోకం.
మల్లె మందారాలతో, తా
మర గులాబీ పూలతో, నే
చెలిమి చేసీ, విసువు తోచీ
అలసి వచ్చా నీ పొలాలకు.

పువ్వు లెవ్వరి పూజకొరకో
పూజలెవ్వరి ప్రేమకొరకో
ప్రేమలెవ్వరి పెంపుకొరకో
ఆమెకొరకీ యాత్రలు

(మొదట్లో ఆమెకు అతడి భాష అర్థమయ్యేది కాదు రాను రాను అదేభాషలో అతడికి జవాబు చెప్పడం నేర్చుకొన్నదామె.)

గడ్డిపిల్ల :

పువ్వు లెవ్వరి పూజకొరకో
పూజలెవ్వరి ప్రేమకొరకో
ప్రేమలెవ్వరి పెంపుకొరకో
ఆమెయే యీ పైరుతల్లి.

మల్లె మందారాలు, నీ తా
మర గులాబీ పూలు, లోకపు
అందచందాలన్ని రుచులూ
ఆమె పూజలకే.

పట్టగావలె మేడి, కాడికి
కట్టగావలె సూర్య చంద్రులు,
పితుకగావలె పాడిపంటలు
బ్రతుకు బ్రతుకున తృప్తిగా.

(శీల మరొక గడ్డిపిల్ల. ఆవలి జనపచేను గట్లునుంచి ఏదో పాడుకొంటూ అక్కడికి వస్తుంది. ఆమె చేతులలో కూడ కొడవలీ, గడ్డిబుట్టా ఉంటాయి. ఆమె శ్రీవత్సను విమర్శనా దృష్టితో చూస్తుంది. అతడు మాత్రం ఆమెను అప్యాయంగా పలుకరిస్తాడు.)

శ్రీవత్స :

తెల్లమబ్బు తునకనుండి
తేనె కురిసె ననుకొంటి :
గొబ్బికంప మాటునుండి
కోయిల పల్కె ననుకొంటి :
మాకోసం పుష్యం మధు
మాస మాయె ననుకొంటి :

గడ్డిపిల్ల :

పచ్చపైరు పూలియ్యవి
పరమేశుని చిరునవ్వులు,
అట్టహాస మేలా మా
అణు మాత్రపు బ్రతుకులో ?
ఆకుచాటు మొగ్గలమై
ఆడుకొందు మీ మాటున

ఇనుడేమో పెరవాడని
యెర్రబడ్డ దాకాశం,
ఉదయమైన కాదియ్యది.
ఉన్నకొలది పెంజీకటి.

చీకటి చల్లారగానె
లోకం వికసిస్తది గద :

గడ్డిగంప నిండలేదు
గరికపోచ నిదురిస్తది,
నెమరు లాపి గోమాతలు
నిన్నేమని భావిస్తయొ :

కమలకు కంటకమైనా
కదలక తప్పదు రవికి.

(మౌనంగా ఇద్దర్నీ పరికించి చూచి, అందిన పరకెల్లా పెరుక్కొంటూ, అలా చేల గట్లలోకి నిష్క్రమిస్తుంది శీల. ఇద్దరూ ఆమె పోయిన దారికేసి కొంచెంసేపు చూస్తూ ఉండి పోతారు.)

శ్రీవత్స :

కమలకు కంటకమైనా
కదలక తప్పదె రవికి ?
తప్పని పనులే మున్నవా ?
దయమాలిన ధర్మమేదా ?

గడ్డిపిల్ల :

బాధలు బెంగలెరుంగని నీతో
బాతాఖానీ నా కేలా :
మందకు కొంచెం తడవైతే, కా
మందులు కూకలు వేస్తారు.
పాల పిట్టలా తోటలు, కోటలు
పాలించాలని వుంటుంది.
కొడవలి నిత్యం కొరకొరమంటూ
గొంతుమీద కూర్చుంటుంది.

సెలవిక, పోతా, చేరువ చేలో
చెంగలి బాగా పెరిగింది :
రేపేవేళకు వస్తే – రా – ఈ
పూపకు పిందెలు పెడదాము.

(పూచిన కంది రొబ్బల్ని లాలిస్తూ ఆమె అలా నిష్క్రమిస్తుంది. అతడొక్కడే మిగిలిపోతాడు.)

## రెండవ రంగం

(పైరు చేలగట్లు, గడ్డిపిల్ల త్వరత్వరగా గడ్డి కోస్తూ వుంటుంది. మధ్య మధ్య తలెత్తి చూస్తూవుంది. కొంచెం పాట కూడ పాడుతూవుంది. సాయంకాలపు నీరెండలో ఆమె ముఖం మీది చెమటబొట్లు ముత్యాల్లా మెరుస్తున్నాయి.)

గడ్డిపిల్ల :

ఒడుదుడుకులు లేకుండా,
ఒరుల పొంత పోకుండా,
తోట మూల జీవించే
ఊటబావి గుండియలో
రాయి విసరినా వేలా ?
హాయి కలచినా వేలా ?

కొంచెపు గుణమే లేక
కోరిక లన్నవి లేకా
లోకం మించి వసించే
ఆకాశం మనసులోన
మబ్బు విసరినా వేలా ?
మనికి కలచినా వేలా ?

మంచు బొట్టొ, మధు బిందువొ
మనుగడ కంతే చాలని
కమ్మగ జీవించే యీ
గడ్డిపువ్వు కడకంటికి
పాల కడలి చూపి – తు
పాను రేపినా వేలా ?

(కంది రొబ్బలను ఒత్తిగించుకుంటూ మెల్లగా శ్రీవత్స ప్రవేశిస్తాడు. ఆమెకు కనిపించకుండా కొంచెంసేపు అలానే నిలబడివుండి ఆమె పాటకు, ఆనందిస్తాడు. చివరకు ఆమె కంటబడ్డాడు)

శ్రీవత్స :

కాయకష్టం విలువలన్నీ
కరుణకోరే వరములన్నీ
మొగము నిండా ముచ్చెమట్లయి
పొలములకు నీర్వెట్టగా.....

పరువు పరువున గడ్డికోస్తూ
పాటకూడా పాడతావు,
చాలకష్టం కాదటే ? ఈ
శ్రమకు అంతే లేదటే ?

గడ్డిపిల్ల :

చెమటపట్టుట చిత్రమా ? ఈ
శ్రమకు ఫలితం కొంచెమా ?
నెమరువేస్తూ పాడిపశువులు
నిన్నుచూచే చూపులో - ము

క్కోటి దేవత లేకమై - శత
కోటి దీవన లియ్యరే :

పాటపాడుట కష్టమా ? ఈ
పనికి సాయం కొంచెమా ?
ముమ్మరముగా సాగిపోయే
మోత పనిలో, కోత పనిలో

ప్రతి నరానికి ఊత మిచ్చి
పట్టునిల్పే శక్తి యేదీ ?

చేయగల పని చెయ్యడంలో
హాయిగా వుంటుంది మనసు,
మనసులోపలి కోర్కెలెన్నో
మరగి తేలే పాలమీగడ....

పాట అంటే తక్కువా ? ఈ
బ్రతుకు కంటే ఎక్కువ.

శ్రీవత్స :

బ్రతుకు తీవియ కొనను కోమల
భావకుసుమపు తావిపాట,
సుఖ పయోనిధి మీద నిర్మల
సుధారసమే పాట, కానీ...

మనసులో కోరికలు మరగీ
మనసె మరగీ, మాడిపోయే
గడ్డిపువ్వును చూచినపుడే
కలగు నా గుండె.

గడ్డిపిల్ల :

మల్లెకున్నా మమతలు, చెం
గల్వకున్నా చెలుములు, తా

మరకు గల క్రొందావులన్నీ

మరలవా నిష్ఫలములై ?

గడ్డిపువ్వనె చెప్పనేలా ?

గడ్డుబ్రతుకులు కలవు చాలా ;

పేరు లెంచగ నేలను? జీ

వించు టొకటే చాలును.

(అంతలో యథారీతిగా శీల ప్రవేశిస్తుంది. అతణ్ణి చూచి చిరునవ్వు నవ్వుతుంది.)

శీల :

రోజూ యీపాటేళకె

రాజులా గొస్తావు,

కనపడ్డా పిల్లలతో

కబురులు సాగిస్తావు.

ఏమీ పనిలేదా ? నీ

కిదే పనా ఏంటీ ?

శ్రీవత్స :

రోజూ యే రాజైనా

మోజులేక వస్తాడా ?

కలువలతోనేగాక

కబురులు సాగిస్తాడా ?

చుక్కల సేవలకంటే

యెక్కువ పనులేముంటై ?

శీల :

రోజులు గడిపే కంటే
రాజుకు పను లేముంటై
రాజుల సేవలు చేసే
రైతుల కే పనులన్నీ :
సోమరి సోమన్నలకే
సుఖ సంతోషాలన్నీ :

గడ్డిపిల్ల :

సాయంకాలం పూట
చల్లగాలి సేవిస్తూ
పైరు చేలగట్లలో
పైరుకోసమని వస్తే....
అనగూడని మాటల్తో
అబ్బాయిని నొప్పిస్తవు !
లోకంలో ఎవ్వరి పను
లు వారికే వుంటాయి.
కాయకష్ట మొకటే పని
కాదమ్మా, మెదడుపయో
గించే పనులు--- పని చే
యించే పనులూ వుంటయ్.
అతిథి గదా మన కీయన
ఆదరించి మాట్లాడితె
పోయే దేమున్నదమ్మ ?
పుణ్య మెరగవేమమ్మా ?

పనిలేకుండా యెవ్వరు
మనజాలరు లోకంలో.

శ్రీవత్స :

చిన్నపిల్లలే, అంటే
అన్నదిలే, పోనీలే,
సొరకాయ్ కోతలు కోసే
సోమరి ననుకున్నదిలే,

రసహృదయం కొరతవడ్డ
రవుడీననుకున్నదిలే.

(ఆమె చేతిలోని కొడవలి తీసుకొని గడ్డికోత ప్రారం భించాడు శ్రీవత్స. "పర పర పర పర, పర పర పర పర పర పర కొక పద్దకు పరమాన్నంగా, పర పర పర పర, పర పర పర పర' కోత సాగించాడు, నిమిషంలో రెండు బుట్టలూ నిండిపోయాయి. ఆమె, శీలా ఆశ్చర్యంతో ప్రతిమలలా చూస్తూ నిలబడి పోయారు.)

శీల :

గడ్డికోత నేర్పావే,
గడసరి లాగున్నావే,
చెక చెక మనిపించావు.
చెయి తిరిగిన పనివాడివె.

అల్లరి పిల్లాడేమో,
అలుసవుతా మేమో నని

నోటి కొచ్చి నట్టెల్లా
నొవ్వనాడితివి నిన్ను.

తప్పైయినది ఈసారికి,
నొప్పించను ఇంకెప్పుడు:
కమ్మని సాయంతరాలు
వమ్ముచేయ నింకెప్పుడు.

రాజల్లే యీ సీమకు
రోజూ వస్తూ వుండు.
మా కొంచెపు బ్రతుకునుండి
చీకటి తొలగిస్తుండు.

(బుట్టనొక్కి చూచి, చంక బెట్టుకొని, శీల నిష్క్రమిస్తుంది. గడ్డిపిల్ల బెదురుగా అతని చేతులకేసి, ముఖంకేసి చూస్తూ ఉంటుంది. అతడు నవ్వుతూ గడ్డిబుట్టమీద కూర్చుంటాడు)

గడ్డిపిల్ల :

తామర పువ్వంటి నీ
కోమలహస్తం చూడు :
మందారం పువ్వులాగ
కందిపోయినది పాపం :
సుకుమారపు హస్తానికి
సుతిమెత్తని చిత్తానికి

రాపిడి కలిగించానని
కోపిస్తురు దేవతలు :

గొబ్బి ముల్లు కాబోలు
గుచ్చుకున్న దా వ్రేలికి,
గూకుతున్న పొద్దల్లే
పాకిందదె నెత్తుబొట్టు :

శ్రీవత్స :

కాదు కాదు ఎఱ్రసిరా
కల మంటిన మరక అది,
కందుట కా, దెప్పుడు నా
కరము లిట్టులే వుంటవి.

పని యేదైనా గాని
పరమేశుని రూపం గద :
పరమేశుని రూపంలో
తరతమమ్ము లేముంటై ?

పచ్చగడ్డి కొయ్యడమూ
పరిపాలన చెయ్యడమూ
దారులు వేరే గానీ
దూరం వొక్కటే శివునికి.

ఐనా, నీవంటి అమా
యక సుమమే మునుముందుగ
కాలికొ, వేలికొ తగిలి
గైకొంటది కైవల్యం

గడ్డిపిల్ల :
అవి యేమో.... నాబుద్ధికి
అందని సంగతులు, కాని
నీచే పనిచేయించిన
నేరమె నన్ను దహిస్తది.
ఏ మేడనొ, ఏ మిద్దెనొ,
ఏ మెత్తని పానుపునో
పవళించే దేవుడికే
పనిచెప్పిన పాపినేను :

పేరూ ఊరూ లేని
పేదపిల్లనై యుండి
అందని ఆనందాలకు
అర్రుచాతునెందులకో :

శ్రీవత్స :
ఆనందం అన్నట్టిది
ఈనాడింకా వుంటే
అది నీలో, నీ చేలో
ఆశ్రమాలు కట్టుకొంది :

మేడలు మిద్దెలు వున్నా,
మెత్తని పానుపు లున్నా,
హృదయం లేకున్నప్పుడు
వృథయేగద బ్రతుకంతా ?

లోకం హృదయం మొత్తం
నీ కొంగునె ముడుచుకొని
దబ్బగడ్డి దుబ్బులలో
దాగొంటివి తమాషగా :

నిన్నుచూచె కాబోలు
నేర్చినాడు రవి కూడ,
వెలుగు మూట కట్టుకొని
వెడలినాడు కనుమాటై :

ఇంటివద్ద నీ గోవులు
ఎదురు చూస్తు వుంటాయి,
ఇంతకు నీ పేరెవ్వరు ?
ఎందుకు చెప్పవు నాతో ?

గడ్డిపిల్ల :

పేరూ వూరూ లేని
పేదపిల్ల నంటిని గద ?
రేయి వచ్చి పడుతున్నది.
పోయివత్తునిక నేటికి.

శ్రీవత్స :

ఇంత పరిచయము పొందీ
ఎంతో అడిగించుకొనీ
పేరు చెప్పకుండగనే
జారి పోవుచున్నావు :
చెప్పవద్దులే పేరు,
శ్రీమంతము నీ పేరు,
సుందర మధుమాసలక్ష్మి
కెందుకులే ఒక పేరు :

మందారము నీ పేరు,
మకరందము నీ పేరు,
సౌందర్యము నీ పేరు,
సౌహార్ధమె నీ పేరు....

ఏమున్నది పేరులోన
హృదయము కోమలమైతే ?
ప్రేమే జీవితమైతే
ఏమున్నది పేరులోన ?

మోహన దేవతవు నీవు,
స్నేహ రూపిణివి నీవు,
ప్రీతిగ నిన్నికమీదట
పిల్చుకొందు "స్నేహా" యని.

స్నేహ :

ఎన్నిపేర్లు పెట్టావు :
ఎన్ని రుచులు పోశావు :
మొద్దుపిల్లకేలా ఈ
మోయలేని బరువులు ?

అల్లరి పిల్లాడి లాగు
అగుపిస్తున్నావు నాకు :
చాలించూ యీ పాటికి
సంజ నవ్వుతూ వుంది :

మినపచేలు, జనప పూలు
మెంతికూర, దొంతి బీర
రంగు రంగు నవ్వులతో
తొంగి తొంగి చూస్తున్నవి :

శ్రీవత్స :

అల్లరి పిల్లాడినా ?
కల్లలు మాట్లాడితినా ?
అనుమానం వుంటే మరి
అడుగూ నీ నేస్తాలను :

రకరకాల తీగల్నీ
రంగు రంగు పువ్వుల్నీ,

సీతకోక చిలుకల్నీ
చేలమీది గాలుల్నీ
పూవుమీద పుప్పొడి వలె
పొలమునెల్ల కమ్ముకొని
హంగు నడుపుచుండిన యీ
బంగరు నీరెండ నడుగు:

అడుగు నీ నేస్తాలను :
అంత మహా గొప్పయితే
పెట్టమనూ నే పెట్టిన
పేరుకంటె మంచి పేరు ?

స్నేహ :

అడుగుదాములే రేపు,
ఆలస్యం అయ్యింది,
కాలు సాగడం లేదు
కదిలిపోవ నిన్విడిచి :

"స్నేహా" యని పిలిచి మనసు
స్నిగ్ధం చేశేశావు :
వడగొట్టిన గుండె తేనె
వర్షంతో తడిపావు :

నువు చేనులో నుండి
రివ్వుమనెను గోరింకలు,
ఆకుమడి సమీపంలో
ఆడుచున్నవవె నాగులు :

నన్నెరిగిన పొలమింకా
నిన్నెరుగదు బాగా,
చేరిపొమ్ము నీ వింటికి
చీకటి పడు లోగా :

(ఇద్దరు చెరొక ప్రక్కకు తిరుగుతారు)

## మూడవ రంగం

(అవే చేలగట్లు. సాయంత్రం. రోజూకంటె కొంచెం పెందలకడే, శ్రీవత్స ఏదో పాడుకుంటూ ప్రవేశిస్తాడు. వరికుప్పలపై పిచ్చుకలు, రామచిలుకలు కిలకిలలాడుతున్నై. కంది రొబ్బలపైనిల్చి, ఏట్రింత పిట్టలు ఏమో-చెప్పుకుంటున్నై, ఎండ ఇంకా తగ్గలేదు. పొలాల్లోకి రైతుబిడ్డలు, గడ్డి పిల్లలు ఎవరూ ఇంకా రాలేదు.)

శ్రీవత్స :

చిరుగడ్డిపూలు నీ చిరునవ్వు లేనోయి,
కానిచో - వాటికా కరుణ యెక్కడిది ?
మానసము రంజించు మాధుర్యమెక్కడిది ?
ఆత్మనే కరగించు అమృతమెక్కడిది ?

దేవ, నిన్నెరుగరా
దేవతలు గూడ.

శ్రమయెల్ల నీ క్రియా సంకల్పమేనోయి,
కానిచో - దానికా కాంతి యెక్కడిది ?
భూమినే పెకలించు భుజశక్తి యెక్కడిది ?
ఉడులోకములు గెల్చు ఊహ యెక్కడిది ?
ఓ దేవ, నిను గనవు
వేదాలు కూడ.

ఈ గడ్డిపూవిక్కడే రాలిపోవునో,
ఈ దివ్యరుచి ఇక్కడే మాసిపోవునో,
ఈ పరిశ్రమ ఇక్కడే యింకిపోవునో :
ఐన - నీవును అదృష్టానికిల దాసుడవె :
నిర్జించి రావోయి
నీ మాయ నీవె.

(అటూ, ఇటూ వెతుక్కొంటూ అలా కందిచెట్ల గుంపులోకి వెళ్ళి పోతాడు. రెండవ ప్రక్కనుంచి స్నేహ గడ్డి కోసుకొంటూ ప్రవేశిస్తుంది. అటూ ఇటూ వెళుతుంది. ఎవరూ కనిపించరు.)

స్నేహ :
ఈ పొలముగట్టు పైనే చూచితిని గనుక
నే, దొరికినది నాకు నీ పాదసేవ :
నా పుణ్యమేదొ ఈనాడు నీ మనసులో
మనసుంచి నిన్ను తెచ్చినది నా త్రోవ.

ఏ మీది కొమ్మనో, ఏ మిద్దె కుండీనా
నే పూచియున్నచో నీపదము లందునా ?
నా బ్రతుకులో ఒక్కనాడైన వలచి నీ
చరణాలు స్పృశియించు తరుణమే కల్గునా ?

నా పుణ్యమేదొ ఈనాడు నీ చిత్తాన
చివురించి నిన్ను తెచ్చినది నా త్రోవ,
త్రుంచికొనిపోదువో, త్రొక్కుకొనిపోదువో,
పండువుగ నా బ్రతుకు పండించుకొందువో :

(అటూ, ఇటూ వెతుక్కొంటూ అక్కడక్కడ గుప్పెడేసి పరకలు కోసికొంటూ అలా కందిచెట్ల గుంపులోకి వెళ్ళిపోతుంది. రెండవ ప్రక్కనుంచి కొడవలి లేకుండానే గడ్డిగంప మాత్రం పట్టుకొని శీల ప్రవేశిస్తుంది. అటూ, ఇటూ చూస్తుంది. ఎవరూ రాలేదన్నట్టు బిక్కమొగం పెడుతుంది.)

శీల :

చిన్నప్పటినుంచి – నా
చిన్నప్పటినుంచీ,
చేలల్లో – ఈ పచ్చని
చేలల్లో పనిచేస్తా,

పని చెయ్యడమే.... తెమలని
పని చెయ్యడమే
మనుగడ... నా వంటి పేద
మనుగడ నోచిన నోము.

గడ్డి కోసుకుంటూ....
కంది కాయలను తింటూ,
కూరాకులు సేకరిస్తు,
పూరేళ్ళను బెదరిస్తూ,
ఆకులలో దాగొన్న
అలచంద పువ్వల్లె
చల్లగా నా బ్రతుకు
సాగి పోవాలి....
ఎవ్వరికి తెలియకే
ఏ లోటు నెరుగకే
మెల్లిగా నా మనికి
డుల్లి పోవాలి.

తమ్మి పువ్వును కాను,
తుమ్మెదలు వద్దు,
స్నేహ వలె నా కెవరు
స్నేహితులు వద్దు.

పూచిన తీగల చుట్టూ
మూగుతవీ తుమ్మెదలు,
రాలిన రేకుల కేసీ
రవ్వంతైనా చూడవు.

గడ్డిపువ్వుకడ చేరీ,
కలువ పువ్వు వని చెప్పీ,
మురిపించీ, మధువు గ్రోలి
ముంచేస్తవి బ్రతుకునే.
మా నేస్తం స్నేహకీ ప్ర
మాదం తప్పించాలని
వనదేవత లందరికీ
వందనాలు చేస్తాను.

(స్నేహ జనపచేలోనుంచి అడ్డగట్టున అక్కడికి వస్తుంది. కళ్లు మూసుకొని దిక్కులకు నమస్కరిస్తున్న శీలను చూచి ఆశ్చర్యపడి, చుట్టూచూచి, తానుకూడ చేతులు జోడించి నిలుస్తుంది. శీల కళ్ళుతెరచి చూచి, కొంచెం సిగ్గుపడుతుంది. ఆమె స్నేహ కంటె కొంచెం చిన్నది. అయినా ఎక్కువ గడసరి.)

స్నేహ :

చేస్తున్నా వెవ్వరికో
చేతులెత్తి వందనాలు,
ఏ వాగులు నిండాలనో :
ఏ పొలాలు పండాలనో ?

దేవుడు దెయ్యం లేనీ
దిప్పకాయవందురు నిను,
ఇంత భక్తి నీ లోపల
ఏ మూలను దాగొన్నదొ :

నిన్నొంటరిగా చూచి
నీ రూపం తెలిసికొని
అంతులేని ఆనందం
అనుభవించితిని నేడు :

నీ కోరికలన్ని వేయి
రేకులతో మోసులెత్తి
కుప్పలుగా పండాలని
కోరుకొందు నేను కూడ.

శీల :

దేవుడు దెయ్యం లేని
దిప్పకాయనే నేను,
తెలుసుగదా, నా కోసం
తలవంచను యెవ్వరికి

పగలనకా, రాత్రనకా
పని పాటులు చేసుకునే
మనిషికి దేవుడు, దెయ్యం
పని యేమిటి లోకంలో ?

నా కోసం కాదమ్మా,
నీ కోసమె యీ వేళా
వనదేవత లందరికీ
వందనాలు చేశాను.

కల్లా కపటం తెలియని
కన్నె ప్రాయమమ్మ నీది
చిటికలోన నిను మోసం
చెయ్యగలడు మానవుడు

స్నేహ :

చిన్నప్పటినుంచీ.... యీ
చేలల్లో పనిచేస్తూ
ఒకటే ప్రాణంగా మన
ముంటున్నా మిన్నాళ్ళూ :
ఎందుకమ్మ యీనాడు
ఈ బోధలు మొదలిడితివి ?
లోపం ఏదైనా నా
లోపల కనిపెట్టావో ?

మనసూ మానవతా గల
మనిషే మాధవుడందురు.
అతడే నీ రూపున యీ
హితముపదేశించాడో ?

చెప్పినట్టు చేసే మని
షికి నేరము లేముంటై
నేరమి యొక్కటి తప్పు ?
నేరుపు లెవరికి వారివె.

చెప్పమ్మా నేనేమిటి
చేశావో అంత తప్పు :
నాతరపున ప్రార్థించే
హేతువేమి కలిగిందో ?

శీల :

అగ్గికి చెదపడుతుందా ?
అంటున్నద గంగమ్మకు ?
దీపకళికలాంటి నీకు
లోపమేమిటుంటుందీ ?
మొగ్గ విచ్చగానే చుట్టు
మూగుతాయి తుమ్మెదలు,
వెలిగే దీపం మీదికి
వెడలుతాయి పొడగువ్వలు.

నోరులేని పువ్వు బ్రతుకు
నొవ్వకుండ చూడుమనీ,
మా యెరుగని దీపకళిక
మర్యాదను నిలుపుమనీ
ప్రార్థించా నంతే... నా
ప్రార్థన మన్నిస్తాడో :
చొప్పదంటు బొమ్మల్లే
చూస్తూ కూర్చుంటాడో :

సుకుమారపు కుసుమాలను
సూదుల కర్పించే ఆ
భగవంతుని నమ్ముకొనీ
బద్ధకించి కూర్చోకు....

ధర్మం నీ దారికి తన
దారిని తెస్తే తప్ప
సిరి కొడుకైనా గానీ
చేతికి చేయందీయకు.
కలిగిన దానితో తృప్తి
కలిగినదే సుఖజీవం,
సుఖజీవం పొంగి నింగి
సోకినదే స్వారాజ్యం.

ఆవులకూ, దూడలకూ
ఆహారం పెట్టుకొంటు
ఆగిపోదు నే నిందు
సాగిపొమ్ము నువు ముందు.

(అలా అంటూనే శీల మరొక గట్టుకు వెళ్ళిపోతుంది. స్నేహ ఏమనడానికీ తోచక అలానే నిలబడిపోతుంది. తర్వాత ఆలోచనలో పడుతుంది.)

స్నేహ :

సుకుమారపు కుసుమాలను
సూదుల కర్పిస్తాడా ?

అడుగులపై పడు పూలను
పడద్రొక్కుకు పోతాడా ?

ఆత్మార్పణం కంటె వేరె
అవకాశం ఏమున్నది....
పెరటిని పూచిన పూలకు ?
తెరువున నిండిన చేలకు ?

తుంగముస్త వద్దనుండి
తులసికోట వరకూ గల ....
మంటిపెల్ల వద్దనుండి
మింటి చుక్క వరకూ గల ....

ఈ సమస్త లోకాలను
ఏలవలసినట్టి స్వామి
ఎప్పుడు, ఎందుకు, ఎవరికి
ఏమి నిర్ణయిస్తాడో......

ఎవరూహిస్తారూ.... ?
ఏమని ప్రశ్నిస్తారూ ?
కత్తిరించ వద్దంటూ
కలహిస్తద చేతిగోరు ?

కొండలెక్క వద్దంటూ
మొండికెత్తుతద పాదం ?

ఆత్మేశుని కాయంలో
అవయవాలె గద జగాలు ?

తేజంగల కుర్రాడు
దేవతలాగున్నాడు
అప్యాయత గలవాడు
అన్యాయం చేస్తాడా ?

చద్దన్నమె తిరిగి నరుని
ముద్దచేసి మింగినచో
అడ్డంచెప్పే దెవరు ?
ఆలించే వారెవరు ?
విశ్వాసంలో ఎంతటి
విషమైనా విరుగుతుంది.
ఆరాధనలో ఎంతటి
అఘమైనా కరుగుతుంది.
ఎందుకు నాకీ చింత ?
ఏమిటి నే నాశింత ?
స్నేహమాత్రమైతే యీ
మోహబుద్ధి ఏమింత ?

(శ్రీవత్స మెల్లగా ప్రవేశిస్తాడు. తనుకూడ ఏదో ఆలోచిస్తు వున్నాడు)

శ్రీవత్స :

తామరపువ్వంటి నీ
మోము చాల వాడింది
ఎండనకా, కొండనకా
ఎందుకలా కష్టిస్తవు ?

అలసటకాదే ? పోనీ
ఆపరాదటే పని:

స్నేహ :

పని ఆపుదునా నేను ?
పంట లెలా పండుతాయి ?
పాడీ పంటా లేక
ప్రజలేగతి బ్రతుకుతారు ?

అలసటతో పోనీ - నే
నంతరిస్తె లోటేమీ ?

శ్రీవత్స :

ఏమిటి లోటంటావా ?
భూమికి లేదే లోటు,
లోటెవరిది వారిదేనె
ఓటమి వైయక్తికమే :

మోసు లెత్తకుండా - యే
మొక్కయినా మ్రోడవుత ?

స్నేహ :

కూటికిలేని బ్రతుక్కి
ఓటమిగా కేమున్నది ?
తిండికోసమై కండలు
పిండుకొంటు లోకానికి
సేవచేసి రమ్మంటూ
శివుడు కోరి పంపాడో ?
కర్మానికి తల వొగ్గి
ధర్మానికి కట్టువడీ ?
బ్రతుకంతా ఒక కృషిగా
బాధ్యత నెరవేరుస్తా,
గడ్డిపువ్వ రాలకుండ
కల్పకు సుమమెటు పుడతది ?

శ్రీవత్స :

గడ్డిపూవువలె పూచిన
కల్పక సుమమే నీవు,
రాగల ఉన్నతికోసం
రాల నవసరం లేదు.

పనిచేసే ప్రతి మనిషీ
పారిజాత సుమమేనే,
పుట్టుక చోటును బట్టి
కట్టబడదు తుది విలువ.

జీవిత మొక పందెం, అది
చివరికైన పూర్తి చేసు
కొని పోవుటయే సఫలత,
వెనుదిరుగుటయే విఫలత,

పందెంలో వెనుకబడుట
బలహీనత సూచిస్తది,
సూచనతో నవశక్తుల
శోధన మొదలెట్టాలి :

స్నేహ :

సుఖజీవన వంతులకే
శోభలు శోధనలన్నీ
పందెం పంతం వంటివి
బలవంతుల వినోదాలు.

తలపులోకి నిను కొంచెం
మలుపుకొంద మంటేనే
తీరని నా బ్రతుకులోకి
తెస్తావెందు కవన్నీ ?

కష్టం మధ్యనే పుట్టి
కష్టం మధ్యనే పెరిగి
కష్టానికె అంకితమై
గడచి పోవుచున్నావు....

పోవనిమ్ము నన్నిట్లే,
తోవ మలువ యత్నించకు,
కష్ట జీవి జీవికలో
కలలకు నెల వేముంటది ?

శ్రీవత్స :
కష్టంలో పుట్టావు,
కష్టంలో పెరిగావు,
కష్టంలోనే చివరికి
కరిగిపోత నంటావు ?
కష్టానికి ఫల మేమిటి ?
కన్నీ రొక్కటి తప్ప ?
ఇచ్చేవాడినె దోచి
పుచ్చుకుంట దీ లోకం :

స్నేహ :
ప్రతి కష్టానికి కూడా
ఫలితం కన్నీరైతే

భూగోళమె గడ్డ కట్టి
పోయిన కన్నీటి బొట్టు.
ఈ చేలూ ఈ కుప్పలు
ఆ చెట్లూ ఆ మేడలు
అన్నీ కృషి ఫలితాలే
అన్నీ శ్రమ చిహ్నాలే.

మనిషి కష్ట పడకుండా
మహికెక్కడి దీ భాగ్యం ?
పనిచెయ్యక కూర్చుంటే
బ్రతుకెట్లా గడుస్తుంది ?

ఉండిపోదు నేనిట్లే
ఉర్విమాత సేవిస్తూ
మధురమైన ఈ వేళలు
మరచిపోకు మంతె చాలు.

(గిరుక్కున తిరిగి స్నేహ వెళ్ళిపోతుంది. అలా జరుగుతుందని శ్రీవత్స అనుకోలేదు. నేటి సంభాషణ కూడ అంత సాఫీగా సాగలేదు. రోజూ వుండే తేలిక మాయమైపోయి, దాని స్థానాన్ని ఏదో బరువు ఆక్రమించింది. స్నేహ ఎంత ఆరిందావలె గంభీరంగా మాట్లాడాలనుకున్నా, మనస్సులోని నిస్పృహ దాగిందికాదు. పైగా గిరుక్కున వెనక్కి తిరిగినప్పుడు ఆమె కన్నులు నిండి పొర్లిపోతూవుండడం అతడు స్పష్టంగా చూశాడు. నిశ్చేష్టుడైనాడు. ఎందుకిలా జరిగింది ? ఆ కన్నీరేమిటి?)

శ్రీవత్స :

కష్టా లొందగ రానీ
కలువమొగ్గ బ్రతుకుపైని
ఎండలు కన్నెర్రజేసి
ఇంకిస్తున్నై వాసి :.
తలపుల తారలతో తళ
తళమను చీకటి కన్నులు
చెమ్మగిల్లి వర్షించగ
క్రమ్మిన వే మబ్బు తెరలొ :

కష్టాలను మరపించే
కబురులు చెప్పాలనుకొని,
సుప్తాబ్ధిని మేలుకొల్పి
క్షోభపెట్టినా నేమో ?
మబ్బు తెరలు మరగించే
మంచుబొట్లు మరలించే
తిరిగి తేనే లాలికించే
తెరువేదో నాకిప్పుడు :

(ఆలోచిస్తూ నిష్క్రమిస్తాడు)

## నాల్గవ రంగం

(చేలగట్లలో ఒక మూలగల కందిచెట్లలో, కందికాయలు ఒక్కొక్కటే తింటూ, ఆలోచనా నిమగ్నుడై ప్రవేశిస్తాడు శ్రీవత్స. ఎంతో కాలంగా కులాసాగా సాగిపోతున్న సాయం వేళలకు అంతరాయం వచ్చింది. ఈ పరిస్థితి ఎప్పుడో ఒకప్పుడు వచ్చేదే. మైత్రి అనేది ఇద్దరు పురుషులమధ్య, ఇద్దరు స్త్రీల మధ్య సాగిన స్థాయిలో ఇద్ధరు స్త్రీ పురుషుల మధ్య సాగదు ఎంతో కాలం. అది మరీ చేరువైనా కావాలి. లేక దూరమైనా పోవాలి. అప్పుడేది కర్తవ్యం ? మైత్రి స్థాయిని దాటి చేరువకు వెళ్ళడమా ? దూరం పోవడమా ? స్నేహతో పరిచయమైనపుడు అది మైత్రిగా రూపొందుతున్నప్పుడు, చివరికి అది ఇలాంటి సమస్యగా పరిణమిస్తుందని శ్రీవత్స అనుకోలేదు. కొద్దిరోజులనుంచి మాత్రమే అతనికి ఇటువంటి తలంపులు వస్తూవున్నాయి. ఇప్పుడిక చివరి దశకు వచ్చింది.)

శ్రీవత్స :

ఎక్కడిది ఈ ప్రొద్దు ?
ఇలకెంత దూరం ?
కమలాని కదె ముద్దు.
కలువ కదె భారం.
ఎంత చిత్రం యీ మహత్వం,
ఏమిటో యీ మనస్తత్వం

మొక్కకంటే మొగ్గ
మృదులమై పూచు,
పూవు కంటే మధువు
మధురమై లేచు.

ప్రియమైన కొలది ప్రకృతి
పెరుగు బాధ్యతలు జగతి

బురదనేల నుండి
పుష్పొడులు తీసి,
వెలుగు చీకట్ల రం
గులను వడపోసి,

కృషి నింపుకొన్న జీవన సుధాపాత్ర
కూల్చుకొనునే తీగ వృథ మాటమాత్ర ?

మాధురిమ జన్మ జ
న్మాల కృషి ఫలితం.
అర్హతను బట్టియే
అనుభూతి సైతం,

కిరణ రూపము నేని దిగిరాని రవికి
అరవిందముల పొందు కలుగదెప్పటికి

(గడ్డిబుట్ట తలపై ఒరుగ్గా పెట్టుకొని వయ్యారంగా ప్రవేశిస్తుంది శీల. బుట్ట పడిపోకుండా నిలబెట్టుకోవడంలో నడక నృత్యం చేస్తుంది. అతడు కొంచెం దిగులుగా కనిపిస్తాడు. పలకరించకుండా అలానే చూస్తూ వుంటాడు. అతడి వాలకం కనిపెట్టి శీలే ముందుగా పలుకరిస్తుంది.)

శీల :

ఔనంతె, ఔనంతె,
అదె నిజం, నైజం
కూరాకు పువ్వేని
కోరు తుమ్మెదనే.

కాలరాయుట సుళువు

గడ్డి పువ్వంచు

అనుభవించ దలిస్తె

అర్హతలు వలయు.

శ్రీవత్స :

నేనూ అదె అనుకొంటు

న్నాను...

అర్హత నాకుందా, లే

దా అనుకొంటున్నాను.

అమృతమేదొ కావాలని

అర్రుచాచు ప్రతి మనిషీ

అమరుడు కాగల గుణ మొక

టైనా కలిగుండొద్దా ?

నేనూ అదె అనుకొంటు

న్నాను....

అంతరాత్మ గదులన్నీ

అన్వేషిస్తున్నాను.

శీల :

అనుకోటంతో మొదలై

అనుకోటంతో ముగిసే

వెదకులాట ఫల మేమీ
ఎద చించుకొనుట తప్ప ?
గొంగళి పురుగును బోలే
కుటిల నీ వాదులుకుని
బంగరు రెక్కల తుమ్మెద
వైరమ్మీ పూదోటకు :

స్నేహవంటి పుష్పం నీ
జీవితంలొ దొరుకుతదా ?
ప్రేమముంటే కోసుకొని
హృదయంలో దాచుకొమ్ము :

పగలనకా, రాత్రనకా
పాపం ఆ గడ్డిపువ్వు
నీ తలపుల తోడనే మ
హా తపించి పోతున్నది.
గడ్డిపువ్వె కానీ... నీ
కాలు సోకి మందారపు
సుమమైనది, తరుణ కోకి
లమె యైనది మూగిపిట్ట.

నీవు చేకొనక పోతే
నీవు రగిల్చిన మంటలొ

మాడిపోయి, మండిపోయి
బూడిదయై రాలుద్ది.

శ్రీవత్స :

అంతేనా ? కద కీ స్నే
హానికి ఫల మంతేనా ?
సౌందర్యానందాల నా
సట వ్రాసిన దంతేనా ?

కాగూడదు, ఏమైనా
గాని... అలా కాగూడదు,
పూజా పుష్పం వట్టినె
బూది గలిసి పోగూడదు.
సాలంతా కష్టపడి
సాగుచేసుకున్న మడి
అశ్రద్ధే కారణముగ
అబ్ధి గలిసిపోకూడదు.
ఎన్నోసార్లు అడిగాను
ఇంతైనా చెప్పలేదు
స్నేహ జీవితం గూర్చి
చెప్పగలవ ఏవైనా ?
ఎవరామె ? ఎక్కడ పు
ట్టిందామె ? ఏమిటి నే
ర్చిందామె ? ఏమిటామె
స్థితిగతులు ?

శీల :

పంకజమని చెప్పినచో
పార్వైతువె పంకజమును ?
నీవు కోరునది నిస్తుల
నిర్మల పుష్పమె కాదా ?

ఎక్కడ పుట్టిన నేమి ?
ఎక్కడ పెరిగిన నేమి ?
కోరిన గుణ మున్నప్పుడు
కోసుకొమ్ము పుష్పమును

పెదవికి చేరుకొన్న
ప్రియమౌ మధు కలశమ్మును
జారవిడుతువా, మధువే
జాతి పూలదో తెలియదు ?

ఏమిటి నేర్పిందీ ?
నిను ప్రేమించడమే తప్ప ?
నీవు నేరిపిన విద్యే
నేర్చుకున్న దాత్రముతో.

ఇక .. స్థితిగతు లంటావా ?
ఏమని చెప్పుదు నీతో ?
పేదల పాటులు నీకు
సీదర కల్పిస్తాయి.

శ్రీవత్స :

కష్టా లొందగ రాని
కన్నె కాలమె నీది,
కలకనీరు తేనేలా
కన్నుల లోకి ?
పేదలు నా హృది కెంతట్టి
ప్రియ జనులో తెలిసి కూడ.
నీవ నన్ను నొప్పించి
నింతు వీవె కన్నీరు :

శీల :

నిను నొప్పించినందుకే
కనులు చెమర్చిన వంతే.
పరులముందు నా బాధలు
ప్రదర్శింప నే నెప్పుడు.

కూడు గుడ్డ కోసరమై
కూలి నాలి చేసుకొనే
నిరుపేదలమై మేము
నరజన్మం ఎత్తాము.

తినుటకు పెట్టుట కేదో
దేవుడు దయచేసిన ఒక
కామందులపట్ల జేరి
కాలం గడుపుతున్నాము

పాసి మొగముతోనె మేము
పాటి మన్ను తలకెత్తుక
పొలమంతా యెరువు చిమ్మి
భూదేవిని పూజింతుము.
ఏ పంచను పుట్టామో
ఆ పంచనె గిట్టేము,
మొత్తం బ్రతుకంతా ఒక
ముద్ద అన్నమే మాకు

ఎలుకజీడి, అటుకుమావి,
ఇటుకదాసి, పొన్నగంటి,
చెంచలి, దొగ్గలి, బలుసు,
చేదరాసి కూరాకులు...

గొలుగు, బలుసు, పుల్లరేగు,
గొడ్డటి, నేరేడు పండ్లు....
వానదేవు డొసగినవే
వాస్తవముగ తిండి మాకు.

శ్రీవత్స :

ఔనంతే, ఔనంతే,
అపుడే నే జెప్పలేద ?
మొగ్గ బ్రతుకు రాపిడిలో
ములుకంపగ మారుద్దని ?

మతి మాలిమిచే సంఘం
మంజుల మాణిక్యాలను
మసిపాతను కట్టుద్దని ?
మసిబొగ్గుగ అమ్ముద్దని ?

శీల :

అయితే నాబ్రతుకుమీద
ఏతగవూ లేదు నాకు,
సంతోషంతో ఇట్లే
సాగిపోవగలను నేను,

మోయలేని బాధ్యతలను
మూపు మీది కెత్తుకొని
అంతులేని బెంగలతో
ఆయాసం పడుటకంటె....

ఎవరిపనో చేసిపెట్టి
ఏ నీడనొ విశ్రమించి
మనుగడనే మరిచిపోయి
మనుటెంతో సుఖము నాకు.

వ్యామోహం లేదు నాకు
ఏమాత్రం, ఎవరిమీద
నీ మీదను కూడ, నాకు
నీ మీదే లేదు మమత.

పనికోసం పుట్టాను
పనిచేసుకుపోతాను.
పనినే నేనైనప్పుడు
పనిలే దెవ్వరితోను.
స్నేహను గూర్చేనాకీ
చింతంతా, గుండెనిండ
కోరికలను నింపుకొని
కుత కుత వుడుకుద్దామె :

మందారం తీగలతో
పందెమేసి యాడుద్ది
ముద్దబంతి పందిట్లో
ముద్దులు గులుకుద్దామె :

లేగదూడ నోటి కనీ
లేత పచ్చికను పెరికీ
పచ్చిక పాటుకు డెందం
నొచ్చి పరితపిస్త దామె :

స్నేహను గూర్చే నాకీ
చింతంతా – తానేమో
ఎండమావులను వలచీ
యేరని భావిస్తున్నది :

శ్రీవత్స :

ఎండమావులో యేరో,
ఎట్లు చెప్పగల మిపుడే ?
దాహం గొనవలెను గద
దరికి చేరవలెను గద :
కదలకుండ కూర్చుండి
ఎదను కూడ దాచుకొని
సెలయేటిని నిందించిన
తొలగునె దాహం సుంత ?

శీల :

దాహమె లే దంటావా ?
దరియనె లే దంటావా ?
అడుగూ యీ పాదులను
ఆమె కోరికనుగూర్చి ?

బుద్దెరిగిన నాటినుంచి
ప్రొద్దెరుగని పనితో....
ఈ పొలాల పైరుల్లో
ఎంతో ఆనందిస్తిమి.

ఎప్పుడు నీ వగుపిస్తివొ
అప్పటినుంచీ స్నేహ
నీకు చేరువై పోతూ
మాకు దూరమైపోయె :

ఈ పొలాల అందాలు,
ఈ పూవుల నెత్తావులు,
తొలి సంజలు, మలి సంజలు
తొలకరించు రాగాలు....
అన్నీ నీ స్నేహంలో
సున్నాలై పోయి, స్నేహ
లోకము వేరే లేక
ఏకాకినిగా మిగిలె :

పువ్వులు తురమదు, కొంచెం
నవ్వయినా నవ్వదు, ఆ
సక్తి కూడ చూపదు తన
భుక్తి నిచ్చు పనిలోనూ :

ఏ కొమ్మకు జేరబడో,
ఏ నీడను పవళించో,
బ్రతుకే ఒక బెంగవాలె
చితికిపోవుచున్న దామె :

ఏమి చేయగలను నేను ?
ఏమున్నది నా చేత ?
కన్నీరొక్కటి తప్ప
కనిపించదు దారేదీ :

శ్రీవత్స :

కన్నీటికి బలమున్నా,
కదిలించే గుణమున్నా,
అనుసరించి కృషి చెయ్యక
అగుపించదు ఫలమేదీ.

ప్రతిరోజూ ఈ వేళకు
పరువెత్తుక వచ్చేదీ,
ఎక్కడనూ కనిపించదు.
ఏమయ్యిందో స్నేహ ?

మానవ జీవిత మూహా
గానం కంటే చిక్కన :
మానవ హృదయం కవితా
గానంకంటే చక్కన :

ఊహా శుద్ధాంతాలకు
ఉవ్విళ్ళూరుచు నేను
వాస్తవ సౌందర్యాలను
వదలుకొంటి నిన్నాళ్ళు :

ప్రత్యక్షంగా తానై
వచ్చిన శిల్ప భారతిని
తలపనైన లేక అజం
తా గుహలకు పర్వెత్తితి :

చిత్తంతో ప్రతి దెబ్బా
సుత్తిదెబ్బగా మలచిన
మానవమూర్తిని మించి
మహిత శిల్పమేమున్నది ?

చాలు, చాలు, ఇకనైనా
చాలింతును స్వప్నయాత్ర.
స్నేహ రూప వసంతాన
చేకొందును మధుపాత్ర

శీలా, మీ స్నేహ కింత
చెప్పు మొక్క కబురు, రేపు
పెందలకాడే... కొంచెం
పెందలకాడే రమ్మని

(శ్రీవత్స మరి శీల ప్రత్యుత్తరం కోసం ఆగకుండానే వెళ్ళిపోతాడు. శీల ఏమీ అర్థంకాక అలానే నిలబడిపోతుంది.)

## ఐదవ రంగం

(అవే చేలగట్లు, స్నేహ కొంత పెందలకడనే వచ్చింది. చేలల్లోకి ఇంకా ఎవరూ రాలేదు. అతణ్ణి ఇక తరచుగా కలుసుకోగూడదనే నిశ్చయానికి వచ్చి చాలా రోజులైంది. అయినా కలుసుకోకుండా వుండలేకపోతున్నది. ఇప్పుడు శీల కబురు ఆమె హృదయంలో ఏవో వూహల్ని రేకెత్తించింది. అందులో కొన్ని మరీ అందరని వున్నాయి. అట్టి వాటిని ఆమె బలవంతంగా అణచివేసుకొంటున్నది. అణిచేకొలదీ

పైకి లేచి విజృంభించే బాపతు ఊహలు కొన్ని పాప మామెను మరీ బాధిస్తున్నాయి. అయినా ఔచిత్య మెరిగిన ఆనంద రూపిణి ఆమె.)

స్నేహ :

ఎందుకు రమ్మన్నాడో
పెందల కాడే :

మంచిమాట చెపుతాడా.
మానెయి మంటాడా పని
గడ్డికోసి యిస్తాడా
గంప నిండుగా....

రోజూ తెచ్చేకంటే
మోజు లేవా తెస్తాడా ?
ఎక్కువ లాలిస్తాడా ?
ఎక్కువ నవ్విస్తాడా ?

తీయని పండ్లను తెచ్చి
తినుమని వేధిస్తాడో :
వేగుచుక్క కథలన్నీ
వినుమని పీడిస్తాడో ?

ఎదర తనుంటేనే నా
యెద యెంతో పొంగుతాది,
ఎక్కువ నా కెందుకూ ?
ఇతరము నా కెందుకూ ?

ఎందుకు రమ్మన్నాడో
పెందల కాడే :

పచ్చని పువ్వుల గుత్తుల
పట్టుచీర కట్టుకొని
ఆవచేను నన్నుచూచి
అపహాస్యం చేస్తున్నది :

ఆ చేలో మొలిచినచో
పూచి వుందు రమ్యంగా,
కూటికి గుడ్డకు నోచని
కూలి పిల్లగా పుట్టితి :
ఎప్పటికై నా కీ
హీనత తప్పేనా ?
మనిషి లాగ జీవించే
మంచి రోజు లొస్తాయా ?

కూలి పిల్లగా పుట్టి
కూలి బ్రతుకుకే నోచి
పున్నమ చందురు కౌగిటి
పుణ్యం కావాలంటూ.....

అందని పండ్లకు, మనసా,
అఱ్రు చాతు వేలనమ్మ ?
భూమి మాత సేవిస్తూ
ముక్తిపొంద లేవటమ్మా ?

చేలల్లో కెవరూను
రాలే దింకా....
ఎండ పదను ఇంకాను
పండబారనే లేదు....

తెమలని తలపుల మధ్య
తెరువగుపించుటె లేదు.
కట్టె విసిరినట్టి తేనె
తుట్టె యయ్యె నా మనసు :

ఎందుకు రమ్మన్నాడో
పెందల కాదే

(అలా నీడకు నిష్క్రమిస్తుంది. రెండవ ప్రక్కనుంచి శ్రీవత్స ప్రవేశిస్తాడు. చేతిలో ఒక చిన్న వస్తువేదో వుంటుంది.)

శ్రీవత్స :

మంచిమాట చెపుతా నని
మధ్యాహ్నమె రమ్మంటిని
ఆ యాకటి కెమ్మోవికి
అందీగలనా అమృతం ?

అమరమైన ఆనందం
అనుభవించ గలనా ?

ఆకాశపు నీలిమలో
ఆడుకునే మబ్బు తున్క
గప్పున నా గాలి సోకి
కాలమేఘ మయ్యింది :
ఏ మడి కొట్టుక పోతదొ ?
ఏ యెడారి పసిరిస్తదొ ?

మాయా మర్మం తెలియని
మానవ హృదిలో కోరిక
రేగిన నాడే లోకం
మ్రోగించును రణభేరి:
మలుచుకొందునా దాని
మంగళ తూర్యారవముగ ?
విస్తృతావకాశంగా
విమల తృణ క్షేత్రంగా
సుప్తావస్థ సుఖించే
సుందర హృది మేల్కొల్పితి :
నవ విధాత రాగంలో
నందనవన మౌతానా ?

ప్రేమించితిననీ, తనను
పెండ్లిచేసి కొందుననీ
చెపితే తన చిన్ని మోము
చిగురిస్తదొ, చికిలిస్తదో,

సంతోషిస్తదో, తిర
స్మారంగా నవ్వుద్దో ?

ఇంకా రానేలేదో :
ఏ నీడను కూర్చున్నదో :
గట్టుపైని గడ్డిగంప
కనపడ్డది, కనపడ్డది:

మెల్లగ ఈ మాటునుండి
వెళ్ళి కళ్ళు మూస్తాను.

(శ్రీవత్స నిష్క్రమిస్తాడు మెల్లి మెల్లిగా, కొంచెం తాళి రెండవ ప్రక్కనుంచి – ఎవరో వెనుకనుంచి వచ్చి తన కళ్ళు చేతులతో మూసినట్టుగా – స్నేహ ప్రవేశిస్తుంది. ఆమె తన రెండు చేతులూ కళ్ళకు అడ్డం పెట్టుకుని వుంటుంది.)

స్నేహ :
ఎవరు కళ్ళు మూసినారు ?
ఎవరమ్మా ఈ సాహసి ?
మాధవ కర కమలాలో :
మాలతి నను కొన్నారో :

మ్రోడు నేల స్పృశియించీ
మోసు లెత్తజేసేవూ ?
వైశాఖోత్సవ పంక్తిని
ఈ శాఖకు చోటున్నద ?

వ్యర్థ వాంఛలను మదిలో
అంకురించనీయరాదు.
పెరిగి పెరిగి పెరుక రాక
బీడు పెడుత వవి బ్రతుకు.

ఏమబ్బా ఈ సాహసి
ఇంత మాధురీ మూర్తి:
తీయనైన ఈ మూతలు
తెరువ మనసు రాకున్నది:

(వెనుకనుంచి శ్రీవత్స ప్రవేశిస్తాడు. ఆమె - కళ్ళు మూసిన అతని చేతుల్ని వదిలించుకొన్నట్టు -చటుక్కున అతని ముఖంలోకి చూస్తుంది.)

స్నేహ :

అమ్మ దొంగ బూచోడా :
అదరగొట్టినావు గుండె :
వ్రేపల్లెను విడిచి యిపుడె
వెడలివచ్చినట్లుండె :

నా కన్నులు మూయగలవు
లోకం కను మూయగలవె ?

శ్రీవత్స :

నీ కన్నులు మూసి నేను
లోకం కన్నులు తెరతు :

సాహసి నన్నావుగదా ?

జంకేమిటి  నా కింకా ?

నిను స్పృశించి మాధవుడే

నిండుదనం పొందుతాడు.

వాసంతోత్సవము లన్ని

నీ సరదా కోసమె సుమి.

వ్యర్థ వాంఛ లంటావా ?

వ్యర్థం కావే వాంఛలు :

జీవ లక్షణమె వాంఛ,

సిద్ధి యత్నమె ప్రగతి :

ఒంటి నిండ పుప్పొడితో

ఊహ నిండ మొగ్గలతో

ముందుకు సాగే తీగను

మోడంటే చెల్లుద్దా ?

వాడియున్న లత కూనకు

వలయు నేమొ దోహదము,

దోహదాల నిధి నంతా

దోసిట దెచ్చా నిపుడు.

స్నేహ :

చాలించూ, నాదగ్గర
సాగదు నీ కొంటెతనం,
వ్యామోహాలకు మరి సిం
హ స్వప్నం నే నంటే :

దోహదాల నిధి నంతా
దుగ్ధాంబుధి రుచి నంతా
ఇంద్రలోక సుఖమంతా
ఎత్తుకొచ్చి నప్పటికి....

ఈయజాల నవి నాకు
ఇసుమంతయు సంతోషం
చాలు నాకు నీ పాద ర
జోలేశం కరుణిస్తే

అక్కర లేదది కూడా
అది లభించే తనంతనే.
చెలిమి నెపుడు నా మీద
చేయి వేస్తివొ ఆ క్షణమే.

ఇంక నేను నీ దానను
ఇల తరింతు నీ సేవను,

బెంగలెల్ల తీరినవి
భేదాలును సమసినవి.

గడ్డిపువ్వు గానైనా
కలువపువ్వుగా నైనా,
నీ యడుగుల దరినైనా....
నీ యెడబాటున నైనా....

గడిపి వేయ గలను కోటి
కల్పము లైనా యిప్పుడు
నా భావం కరగిపోయి
నీ భావ స్ఫూర్తి గొంటి.

ఇంతటి సన్మానానికి
ఏ మొసంగుదును కాన్క ?
చెరకు ముక్క ? గొబ్బితేనె ?
చీమచింత గుటకాలు ?

తినుమని కామందురాలు
తేగలు రెండిచ్చె నాకు
తెచ్చినాను నీ కొరకని
తింటావా తేనేతోడ ?

శ్రీవత్స :

బృందావన వీధులలో
ప్రేమ గీతములు పాడి,
వాణీ వీణా తంత్రులు
వయ్యారము లొలకించి

దిగి వస్తూ వుంటావు
దేవత లా నా చేతికి:
తేగలు నే తింటాను,
తీసుకొమ్ము ఈ కానుక

ఏ మున్నది ముఖంలోన ?
ఏమిటి వెతుకు తున్నావు ?
నీ కివ్వక దాచు కొన్న
దే కొంచెం లేదు లోన.

నిన్న దాక మిగిలిందను
కొన్న పాదధూళి కూడ
గుంజుకొంటి వేదొ ముట్టు
కొన్నను కారణాన:

ఉల్ల మెప్పుడో పోయె,
ఊహ అదే త్రోవ త్రొక్కె
నన్ను నన్ను గైకొంటివి
నా కేమి మిగిల్చితివి ?

గడ్డిపువ్వు నంటూనే
కల్పక ప్రసూనమ వై
నడిపించుక పోయినావు
నందన వన వీధులకు...

ఎదురు పడ్డ తారలనూ
ఇన బింబాలను కూడా
ముసి ముసి నవ్వుల వెన్నెల
మూసలలో కరగిస్తూ....

స్నేహ :
ఆగు మాగు మచ్చటితో,
ఆ పై నడవజాల
చాలు లెమ్ము నందనము,
సందవేళ యవుతున్నది.

తీరికగా నీకు వలె
దేవలోక వనవీధుల
మెసలలేను, గోమాతకు
మేత చూడవలె నిచ్చట.

శ్రీవత్స :
ఔను ప్రొద్దు గూకవచ్చె
ఆవులెదురు చూస్తుంటవి,

ఆకలేసి నన్ను కూడ
అనుమానిస్తుంటాయి.
బుట్ట పూర్తి కాలేదో ?
బిలబిలగా నింపావో ?
కొడవ లిలా తే - నే
కోసిపెడుదును....

స్నేహ :
వద్దులే - వద్దులే....
సుద్దులు మహ నేర్చావు.
తడవైనది, పొమ్మిక, మీ
తలిదండ్రులు కోపిస్తురు.

ఇప్పుడే నేనును నాలుగు
గుప్పెళ్ళందుకొని పోదు,
కనిపిస్తుంటావు గదా ?
కనికర ముంటుంది గదా ?

(స్నేహకు కళ్ళు చెమ్మగిల్లుతాయి. ఆమె గిరుక్కున తిరిగి పోబోతుంది. అతడు పట్టుకొని ఆపుతాడు. ఆమె కళ్ళల్లోకి సూటిగా చూస్తాడు. చప్పున ముద్దు పెట్టుకొంటాడు. ఆమె ముఖం ఎర్రబడుతుంది. కోపోద్రిక్త అవుతుంది. తొలగినిలచి దగ్గరకు వస్తే కొట్టేటట్టు చూస్తుంది. అతడు కొంత కంగారుపడినా తట్టుకుంటాడు.)

శ్రీవత్స :
తడిసిన నీ కనుదమ్ముల
తళుకులలో మెరవాలని,
పొంగిన నీ కోపాగ్ని త
రంగాలను దూకాలని....

ఆశించిన పనిగానీ...
అన్యం తలపెట్టలేదు.
శాంతించూ – నీ కొక్కటి
సంగతి చెప్పిపోతాను.

నిశ్చయించుకొన్నాను.
నీవే నా యర్థాంగివి,
ప్రేమచిహ్నా మీ ముద్రిక
పెట్టెద నిపుడే వ్రేలికి.

రేపో, యెల్లో, ముహూర్త
మేపొద్దున కుదురుతుందొ.
సిద్ధంగా వుండునీవు
శ్రీవెంకటగిరి యాత్రకు

(ఆమె నిలుచున్నది నిలుచున్నట్లే చల్లారిపోతుంది. ముద్రికను ఆమె వ్రేలికి తొడిగి వ్రేలిని ముద్దు పెట్టుకుంటాడు. అంతలో అంత కోపం తెచ్చుకున్నందుకు ఆమె సిగ్గుపడుతుంది.

స్నేహ :

ముచ్చట గొలిపే కత్తికి
పచ్చి నెత్తు రాహారం :
ఉరిమే తరిమే మేఘం
కరుణారస హృది కాదా ?

పరతంత్రపు జీవనలో
ప్రాప్తించే అనుభవాలు
అమృత పాత్రికను కూడా
అనుమానిస్తవి. స్వామీ :

ఎంత పాపినమ్మ నేను,
హృదినొప్పిస్తిని ప్రభువుకు :
తృణ పల్లవములు తరిగే
తెరవకు నాకేటి గుండె,

ఎంత పాపినమ్మ నేను
హృదినొప్పిస్తిని ప్రభువుకు :
ఈ కిల్బిష భారంతో
ఏ కొండకు పోగలను :

శ్రీవత్స :

ఆవేశం పొందావు.
ఆనందం చిందావు,
సుందరతరమై మనలను
చూస్తున్నది నవ్యేందిర :

మరచిపోదువో యేమో,
మధ్య గల్గు నొకరోజే :
చెలుల వద్ద సెలవుపొంది
సిద్ధంగా వుండు మింక

(శ్రీవత్స నిష్క్రమిస్తాడు. ఆమె కొంచెంసేపు ఆ దారి వంకే చూస్తూ, తరువాత ఉంగరాన్ని చూచుకొంటుంది.)

స్నేహ :

కొంటె పిల్లవాడమ్మా,
గుండెల్లో కూర్చున్నడు :
బరువెక్కిన గుండెలతో
పరువెత్తుట నా తరమా ?

రాజాతడు, రాత్రి నేను,
తేజము అతని సొమ్మె :
తలచుకొంటె నా బ్రతుకున
కలువలు పూయించు నతడు.

నిజమేనా ? నీ జీవిత
నిబిడాంధతమో ముఖాన
సూర్యోదయ మవుతున్నద ?
శుభ్రోదయ మగుతున్నద ?

నిజమేనా ? ఇది యంతా
నీటి మూట కాదుగదా ?
వట్టేసుక చెప్పాడు,
వట్టి మాట చెపుతాడా ?

శకుంతలకు పతిదానం
జానకికే బ్రతుకు భిక్ష
దయచేసిన పావన చరి
తము గలదీ ప్రేమోర్మిక......

శ్రీశుని ప్రతినిధిగా, నా
వ్రేలిని భూషించి యుండ,
అనుమానం ఏల నాకు ?
అర్థరహిత మాందోళన.

ఈ యనంత విశ్వంలో
తృణ మాత్రం నరుని బ్రతుకు,
ఏదో ఒక రోజు కొరకు
ఏళ్ళకొలది జీవిస్తది.

(ఆకాశం వైపుకు అంజలి ఘటిస్తుంది, రంగం ముగుస్తుంది.)

## ఆరవ రంగం

(చేలగట్లు, పాడుకొంటూ స్నేహ ప్రవేశిస్తుంది. ఆమె చాల ఉత్సాహంగా వుంది. రకరకాల తలపులు ఆమెను ఉద్రూత లూగిస్తున్నాయి. తలపులకు అనుగుణంగా మాటలు, చేతలు రక రకాలుగా వున్నాయి. అందుకు తగినట్టుగానే రంగం సస్య పుష్పలతాధిక సర్వ సామాగ్రితోను సంభరితమై వుంది. మొట్ట మొదట చీకటిగా వున్న రంగం తెల్లవారుతున్న చిహ్నంగా క్రమంగా తేజోవంతమవుతూ వుంటుంది.)

స్నేహ :

పంపరమ్మ దీవించి
పచ్చని లత కూనలార :
పైరుగాలి పందిట్లో
పవళించిన పైరులార :

ఉడులారా : మీరు జట్టు
విడువని నేస్తాలు నాకు
వస్తారుగదా నాతో ?
ఇస్తారుగదా సుఖాలు ?

మీ వలెనే విశ్వం పాలి
మేరల కావలమిణికే
ఈప్సితాల కిపుడిపుడే
ఏర్పడుతున్నది రూపం :

ఎన్నిరాత్రు లీ యొంటరి
తిన్నెపైని కూర్చుండి
నా మది మడతలను విప్పి
మీ ముందర పరచితినో :

నెమరులాపి గోవు లిపుడె
నిదురకు దొరకొన్నాయి,
లేగ దూడ మాత్ర మదే
లేచి గంతు లిడుచున్నది.

(అటు వెళ్ళినట్టు వెళ్ళి మళ్ళీ వస్తుంది; ఆమె చేతిలో పచ్చిక పరకలు ఉంటాయి)

స్నేహ :

ఈ దుబ్బు గడ్డి నా
లేదూడ కీ .....
ఈ గుబురు చెంగలీ
నా గొబ్బి గోవుకీ.....
పాలావు కీ పత్తిరొట్ట – నా
పసి గిత్త కీ జనపకట్ట.

నా చేతిమేత ఈ
నాటితో సరి మీకు.
కామందులే ఇంక
కమ్మగా మేపేరు.
మేయండి ఆవులూ, దూడలూ, ఎడ్లు :
మేరలేసి గడ్డి బీళ్లె మీ దొడ్లు.

(వెళ్ళి మళ్ళీ వస్తుంది. రంగం మీదకు మరి కొంచెం వెలుగు వస్తుంది.)

స్నేహ :

పాడియావా ! నన్ను
పంపుమా దీవించి,
నీ పొదుగు మా కిచ్చు
నిత్య సౌభాగ్యాలు :

పైడి గిత్తా : నన్ను
పంపుమా దీవించి,
భద్ర మిదు మాకు నీ
బంగారు కొమ్ములు :

నిండు చేలల్లోన
నిర్లక్ష్యముగ మేయు
ఓ బుల్లి యాబోత :
జాబు వ్రాస్తుంటావ :

క్షేత్ర లక్ష్మి : మాకు
క్షేమాల నీవమ్మ :
నీ పూజ మరువనే
నెక్కడున్నా గాని.

పుష్యలక్ష్మి : మరచి
పోవకమ్మా మమ్ము :
నీ కుమారిత వసం
తిక పిల్వ చనుచుంటి.

(మరొక వైపుకి నిష్క్రమించి, వెంటనే తిరిగి వస్తుంది. ఇప్పుడు బాగా వెలుగు వస్తుంది.)

స్నేహ :

ఈ చేలూ, ఈ పువ్వులు
ఈ సీతాకోక చిలుక
లీ కొలకులు, చెంగల్వలు
ఎంతోముద మిస్తున్నయ్ :

ముద్దిడుగో పువ్వా : ఈ
మొగ్గకూడ ముద్దిస్తది :

పద్మలతా : చిరు నవ్వులు
పారబోసు కోకమ్మా :

అవిగో పూరేళ్ళు రెండు
అదరి బెదరి పరుగెత్తె :
నన్నుచూచి కాదుకదా ?
నా హృదయం తెలుసుగదా ?

ఇంతదాక నాకెప్పుడు
ఇంతసుఖం ఈయలేదు
ఈ విభాత నవరాగం,
ఈ యుషస్సును పరాగం :

ఈ పిట్టల చూపులలో
ఏవో నవభావాలు :
ఈ పువ్వుల నవ్వులలో
ఏవో అనురాగాలు :

ఇంతకాల మెందుదాగె
ఈ మనోజ్ఞ సౌందర్యం ?
ఉల్లమ్మును చుట్టుముట్టి
పెల్లుబికిన దొకసారిగ :

ఇంత పరిచయం గల్గిన
ఈ పొలాలు పరిసరాలు
ఎలా విడిచి పోగలవో :
ఎందుకో నాకీ బెంగ ?

పారిపోవు చిలుక కేలో

పంజరం పయిని మమత ?

మానవ హృదయం స్నేహా

ధీనం - ప్రేమోద్వైతం :

(వెళ్ళి వెంటనే తిరిగి వస్తుంది)

స్నేహ :

నా యందచందాలు, నా మంచి మన్ననలు
చూచి సంతోషింప నోచుకొనరైరి.
నాతల్లి, నాతండ్రి ఏ తెరవు నున్నారో ;
దివినుంచె ఒకసారి దీవించరమ్మా :
కన్నీరు రారాదు, కలగుతవి కందొవలు :
చెందొవలలో చిక్కి కందిపోవునా రాజు :
వగవగారాదు, ఎవ్వరి కెంత ప్రాప్తమో;
నారాజు సౌఖ్యమే నా లక్ష్య మీనాడు.

(నిష్క్రమించి, మళ్ళీ వెంటనే ప్రవేశిస్తుంది. ఒక గడ్డిపువ్వు త్రెంచుతుంది.)

స్నేహ :

ముసి ముసి నవ్వులు నవ్వే
ముద్దు గడ్డిపువ్వా :
సిగ్గెందుకు నా దగ్గర ?
చిన్ని పెండ్లి కూతురువా ?

చేర్చినావు లేవమ్మా :
కూర్చోవమ్మా ఆటలో :
మనయిద్దరి కొకనాడే
మంచి ముహూర్తం కుదిరె :

పేరంటా లెవ్వరు నా
పేదబ్రతుకులో ? నీవే
పేరంటాలవు, చెప్పూ.....
పెండ్లిచూపు వచ్చిందా ?

కండ్లకు కాటుక కోసం
కబురంపితి వమ్మా,
తనకెందుకు కాటుకయని
మిణికిందట నల్లగల్వ :

పసుపూ కుంకుమ కోసం
ప్రార్థించితి నమ్మా,
నన్నే అడగా లందిట
గున్నమావి బాలెంత:

ఒకటైనా మంచిచీర
ఉంటే బాగుండు ననగ,
సోయగముంటే చాలని
సుస్మిత మయ్యింది బీర :

నరకన్యకు 'నాకూ, సుం
దర సస్య వనేందిరకూ

పొందెక్కడ ? లేమిడిలో
ముందున కడు గెట్లిడుదు ?

(అటుపోయి, ఇటు వచ్చేస్తుంది, కన్నులు చెమ్మగిలుతాయి)

స్నేహ :

పెండ్లి యవు తున్నదని
పెద్ద యుత్సవముతో
చెప్పుకొందామంటే
చెలు లెవ్వ రున్నారు ?

బొట్టు, కాటుక లేదు,
కట్ట బట్టయు లేదు.
చేరనా యీ చిరుగు
చీరతోనే విభుని :

ఎక్కడివొ బాకాలు,
ఏమొ ఆ యుత్సవము,
అదురుతున్నది గుండె :
చెదురుతున్నది మనసు :

(లోపల, మంగళనాద స్వరం, పేరంటాళ్ళ కలకలం, సందడి, చీర, రవిక, నగలు, పళ్ళు, పువ్వులు, పసుపు, కుంకుమ మొదలైన శుభవస్తుసముదాయం గల ఒక పళ్ళెంతో శీల ప్రవేశిస్తుంది. స్నేహ ఆశ్చర్యపోతుంది.)

శీల :

ఎందుకమ్మ కంట నీరు ?
ఎంతొ పుణ్యశీల వమ్మ :
బృందావన కృష్ణుడె తన
డెందములో చోటిచ్చె :

కట్టవమ్మ యీ చీర :

పెట్టవమ్మ యీ కాటుక :

తొడగవమ్మ యీ నగలు :

తొలకరి మెరుపట్లుందువు.

పండింతుము వరి చేలు,

పండింతుము భూ మాతనె,

పండకుండ ఎట్లుంటవి

పర హితాలు మన నోములు ?

కడుపునిండ మేసిన మన

కామధేనువులు మెచ్చి

దీవించిన దీవన లీ

తీరున నిను వరించినవి :

ఆలస్యం కారాదు.

అధిరోహింపుము పల్లకి :

తల్లిదండ్రులను స్మరించి

దైవానికి కేలుమోడ్చి

(స్నేహ ఆనందంతో ఎర్రకలువ అయిపోయింది. ఏదో చెప్ప బోయింది కాని కంఠం గాద్గదికమయింది. పళ్ళెంతో శీల ఆమెను తీసుకొని నిష్క్రమిస్తుంది.)

## ఏడవ రంగం

(పొలాలు, తోటలు, మధ్య ఒక అందమైన ఆశ్రమం, పూలు, అక్షతలు, పన్నీరు మున్నగు మంగళద్రవ్యాలను సదస్సుల పైకి చల్లుతూ శీల ప్రవేశిస్తుంది. ఆమె కొంచెం మంచి దుస్తులతో, సంతోషంతో వుంది. పెండ్లిని, వధూవరులను చూస్తూ, ఆ ఉత్సవోత్సాహాన్ని పంచుకొంటున్నది. లోపల మంగళతూర్య ధ్వనులు, పెండ్లి సందడి.)

శీల :

ఉత్సవమే సర్వత్రా
ఉత్సవమే, మహోత్సవం :
సర్వోదయ సమాజమే
జన్మించిన శుభోత్సవం :

భారత జననీ పద సే
వా భాగ్యం గైకొండని
సేవా గ్రామమునుండి
దీవించెను. బాపూజీ :

ప్రణయ మధుర శుభాక్షితలు
భరతమాత వర్షించె
సుఖ జీవులు కండని, తే
జో మూర్తుల గనుడంచు :

స్నేహ వివాహోత్సవమే,
శ్రీ కల్యాణోత్సవమే,
ఉత్సవమే, సర్వత్రా
ఉత్సవమే, ఉత్సవమే :

(శీల ఆనందంలో మైమరచి ఆడుతుంది. పాడుతుంది)

నందనారామమ్ములో మక
రంద పానము చేయు మధుపా :
భూమిపై నీకింత వలపా ?
ప్రేమ కురియగదే.

పట్టుమోయి మేడి, కాడికి
కట్టు మోయి కృషిని, ప్రతిభను,
పంచు మోయీ గుండె గుండెకు
పరమ సౌఖ్య సుధా ఫలాలు :

నీవు పుట్టిన భూమి కన్నా,
నీవు పెంచిన తోట కన్నా,
నీకు నచ్చిన రుచుల కన్నా,
లోకమేమిటె, చిన్ని వువ్వా ?

అమృత జీవపు జడులలో, మల
యానిలపు సందిడులలో,
అమల గుణముల మడులలో, నీ
యాశలను పండింపవే :

(శీల ఒక ప్రక్కకు వెళుతుంది. అప్పుడు నూతన వధూవరుల వేషంలో శ్రీవత్స, స్నేహా ప్రవేశిస్తారు. అంతవరకు సామాన్య వేషంలో వున్న శ్రీవత్స, పేదబాలికగా వున్న స్నేహ ఇప్పుడు ఎంతో అందంగా, ఆకర్షణీయంగా కనిపిస్తారు. స్నేహ మరీ ఆనందంతో ఉదయ రవిచంద్రికలా మెరిసిపోతుంది. వారు రంగంమీదికి రాగానే శీల హారతి

పళ్ళెంతో ప్రవేశించి, హారతి ఇచ్చి, పళ్ళాన్ని అక్కడి పీటపై పెడుతుంది. ఇద్దర్నీ ఆనందంతో చూస్తుంది. ముగ్గురూ భక్తి పరవశులవుతారు. )

శీల :

దివిజ గంగా దివ్య వాహిని
భువికి దిగి ప్రవహించి వచ్చె
పార్థివేందిర సస్యవల్లరి
ప్రణయమున అంజలి ఘటించె.

వరముగలదే, ఇంతకంటే
వరముగలదే, వాంఛితార్థా
నందబీజము లంకురించి
కందళించెను సవ్యసృష్టి

పైరుపువ్వుకు రక్తితో, ఆ
పరమశివునకు భక్తితో......
హృదయపద్మము లొసగి ముందున
కేగుడిక నవశక్తితో :

(శీల నిమీలిత నేత్రయై, అంజలిఘటించి)

పైరుచేలో పసిడిపువ్వుల
పాపలారా,
కొలనిగట్టున గుబురుమేసే
గోవులారా,
బాలమామిడి పూల తుమ్మెద
బాలలారా.
ప్రేమ దేవత పెదవి కొరికే

పికములారా.

సుఖములారా, సుందర రోష : -

శోభలారా, శుభ్రతారా

దీప్తులారా, దివ్యమైన స

మస్త మాధురిమమ్ములారా :

రండు రండిటు, రాగకాలపు

రామణీయక మెల్ల తెందు:

ధన్యజీవులు కాగ ఈ నవ

దంపతుల కాశీస్సులిండు :

(సర్వదేవతా స్వరూపులైన సదస్యుల ఆశీర్వాదాలతో రంగం వెల్లివిరుస్తుంది.)

## మాతృ పూజ

పైరు చేల గట్టులలో
పచ్చగడ్డి పువ్వులలో
పల్లెటూరి పడుచులతో
పాటలెన్నొ పాడుకుంటూ.....

చల్లగ నా బావ అతను
పల్లవింప జేసిన మా
అమ్మకు - నాగమ్మకు పు
ష్పాంజలినై పూజ సేతు.

ఊడ్పు చేల మునుములలో
ఉయ్యేలా పాటలతో
వరికన్నెల చిరు గుండెల
వరహాలను పండిస్తూ......

నా శైశవ హృదయంలో
వందనములు నాటిన మా
అమ్మకు - నాగమ్మకు భ
క్త్యంజలినై పూజసేతు.

కొబ్బరి మామిడి తోటల
కోయిల తీయని పాటల
శ్రమ నెంచక పాటుపడుచు
సంసారం దిద్దు కొనుచు....

పెంకెతనపు నా గుండియ
ప్రేమార్ధ్ర మొనర్చిన మా
అమ్మకు - నాగమ్మకు కవి
తాంజలితో పూజసేతు.

* * *